


హైదరాబాద్ వార్త

# ఆర్టీసీ బస్సులకు మహిళలను యజమానులను చేశాం

## మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్




రాణిగంజ్ డిపోలో ఎలక్ట్రిక్ బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం.

**బేగంపేట డిజెంబరు 10, ప్రభాతవార్త :** రాణిగంజ్ ఆర్టీసీ డిపోలో బుధవారం 65 ఎలక్ట్రిక్ బస్సులను మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతరెడ్డి, రాంగోపాల్‌పేట కార్పొరేటర్ చీరె సుచిత్రశ్రీకాంత్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ముందుగా ఎలక్ట్రిక్ బస్సులను మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాణిగంజ్ ఆర్టీసీ డిపో నుంచి 65 ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఇప్పటికే హైదరాబాద్, కరీంనగర్, నిజామాబాద్, నల్గొండ, సూర్యాపేటలలో ఈ బస్సులు నడుస్తున్నాయని తెలిపారు. ప్రజా ప్రభుత్వ పాలనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మహాలక్ష్మి పథకం ప్రారంభించి రెండు సంవత్సరాలు పూర్తిచేసుకున్నామని చెప్పారు. ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే ఆర్టీసీలో ఉచిత ప్రయాణాన్ని ప్రారంభించుకున్నామన్నారు. ఇప్పటికే 251 కోట్ల మంది మహిళలు రూ. 8500కోట్ల విలువైన ఉచిత ప్రయాణాన్ని చేసారని తెలిపారు. దేవాదాయ శాఖ ఆదాయం మహాలక్ష్మి పథకం ద్వారా పెరిగిందన్నారు. రెండు సంవత్సరాల్లో 40 శాతం బస్సులను కొనుగోలు చేసామన్నారు. ఆర్టీసీలో కొత్తగా డ్రైవర్లు, కండక్టర్లు, శ్రామికులు వస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో ఆర్టీసీ బస్సులకు మహిళలను యజమానులనుచేసిందని తెలిపారు. సమ్మక్క సారలమ్మ జాతర, శ్రీశైలం, యాదాద్రిలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. నూతన బస్‌డిపోల ఏర్పాటు బస్‌స్టేషన్ల అభివృద్ధి చేసుకుంటున్నామన్నారు. చాలా కాలనీలలో ఇంకా బస్సులు రావడం లేదని తన దృష్టికి వచ్చిందని ప్రజా రవాణా వ్యవస్థ ఇంకా ప్రజల్లోకి తీసికెళ్లాలని రెండు నెలలుగా ఎక్కడెక్కడ బస్సులు నడపాలని సర్వే జరిగిందన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి సూచనతో 373 కొత్త కాలనీలకు ఆర్టీసీ బస్సులను కనెక్ట్ చేయాలని నిర్ణయించారన్నారు. 7 లక్షల మందికి కొత్తగా ప్రజా రవాణా సౌకర్యం ఏర్పడిందన్నారు. అలాగే ఆర్టీసీ బస్సుల అవసరం ఎక్కడ ఉన్నాయో ఆర్టీసీ అధికారులకుగానీ ప్రజా ప్రతినిధులకుగానీ ప్రజలు తెలియజేయవచ్చని సూచించారు. ఐటీ కారిడార్‌లోనూ బస్సులు వేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి మాట్లాడుతూ ప్రతి రోజు 60 లక్షలమంది ఆర్టీసీలో ప్రయాణం చేస్తుంటే అందులో 40 లక్షల మంది మహిళా ప్రయాణీకులు ఉంటారన్నారు. అనంతరం రాణిగంజ్ ఆర్టీసీ డిపో నుంచి తార్నాక ఆర్టీసీఆస్పత్రివరకు మంత్రి, అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రయాణం చేసారు.



శ్రీకట్టమైసమ్మ ఆలయం ముందు ఏర్పాటు చేసిన వన్ వే బోర్డు

'వార్తా' ప్రభావం

### కట్టమైసమ్మ ఆలయం ఎదుట వన్‌వే బోర్డు..

**బేగంపేట, డిసెంబరు 10, ప్రభాతవార్త :** బేగంపేట ఫ్లై ఓవర్‌పై వాహనదారులకు కనిపించకుండా వన్‌వే అంటూ ట్రాఫిక్ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డును అధికారులు ఎట్టకేలకు కిందికి దించారు. కట్టమైసమ్మ ఆలయంముందు వాహనదారులకు కనిపించే విధంగా ఏర్పాటు చేసారు. ఈనెల 7వ తేదీన వార్త హైదరాబాద్ మినీలో 'బోర్డు ఏర్పాటు ఇలా వాహనదారులకు కనిపించేది ఎలా' అంటూ కథనాన్ని ప్రచురితం చేసింది. ఈ కథనంపై స్పందించిన నార్త్‌జోన్ ట్రాఫిక్ 1 ఏసీపీ జీ.శంకర్ రాజు ఆదేశాలతో బేగంపేట ఫ్లైఓవర్‌పై వాహనదారులకు కనిపించకుండా ఉన్న బోర్డును కిందికి దించి శ్రీకట్టమైసమ్మ ఆలయం ముందు బేగంపేట బస్తీలోకి వెళ్లే ప్రాంతంలో ఏర్పాటుచేసారు. దీంతో బ్రిడ్జిపై నుంచి కిందికి దిగిన వెంటనే వాహనదారులు బస్తీలోకి వెళ్లకూడదని, ఫతేనగర్ లింక్ రోడ్డుపైకి ఎక్కి వెనుకనుంచి బస్తీలోకి చేరుకోవాలంటూ ఏసీపీ ప్రజలకు, వాహనదారులకు సూచించారు. బస్తీలో నుంచి వచ్చే వాహనాలకు ఎదురుగా వాహనాలు వెళ్తుండటంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంటుందని, అందుకే బ్రిడ్జిదిగిన వాహనదారులు ఓల్డ్ కస్టమ్స్ బస్తీ, బ్రాహ్మణవాడీ, మాతాజీనగర్ లకు వెళ్లాలంటే ఫతేనగర్ లింక్ రోడ్డుపైకి ఎక్కి వెనుక నుంచి వెళ్లాలని ఏసీపీ విజ్ఞప్తి చేసారు.




కేంద్రమంత్రి కుమారస్వామికి వినతిపత్రం అందజేస్తున్న ఈటల తదితరులు

### కేంద్ర మంత్రి కుమారస్వామిని కలిసిన నాయకులు

**జీడిమెట్ల, డిసెంబర్ 10, ప్రభాతవార్త :** న్యూఢిల్లీ భారీ పరిశ్రమలు, ప్రభుత్వరంగ సంస్థల శాఖ కార్యాలయంలో బుధవారం లోకసభ సభ్యులు మల్లు రవి, ఈటల రాజేందర్, హిబి ఇడెన్, కేరళ రాజ్యసభ సభ్యులు జాన్ బ్రిస్టాస్ ఎంవోఎస్ భూపతి రాజు, మాజీ ఎమ్మెల్యే, హైదరాబాద్ ఎచ్ఎంటి మెషిన్ టూల్స్ ప్రెసిడెంట్ కూన శ్రీశైలంగౌడ్‌లు కేంద్ర మంత్రి హెచ్.డి. కుమారస్వామిని కలిసి భారతదేశంలో ఉన్న హెచ్ఎంటి మెషిన్ టూల్స్ పునరుద్ధరించాలని అలాగే ఉద్యోగుల బకాయలు చెల్లించాలాని కోరుతూ వినతి పత్రం అందజేయడం జరిగింది. అనంతరం కేంద్రమంత్రి కుమారస్వామి సానుకూలంగా స్పందించి వచ్చే మూడు నెలల్లో దేశంలో ఉన్న హెచ్ఎంటి మెషిన్ టూల్స్ పునరుద్ధరణ, ఉద్యోగుల బకాయలు చెల్లింపునకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ కమ్రాన్ రిజ్వి, జాయింట్ సెక్రటరీ ప్రేమ్ చాంద్ మోర్య, డైరెక్టర్ నరేష్ కుమార్ బ్రెష్టస్, హైదరాబాద్ ఎచ్ఎంటి జనరల్ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ పి. శ్రీశైలం, ప్రెసిడెంట్ శ్రీనివాస్ నాయక్, వైస్ ప్రెసిడెంట్ ఎన్ చారీ, జాయింట్ సెక్రటరీ ఎ. శ్రీహరి, పింజోర్ ఎచ్ఎంటి సంజయ్ కుమార్, జనరల్ సెక్రటరీ విశాల్ శర్మ, అజ్మీర్ ఎచ్ఎంటి ప్రెసిడెంట్ కైలాష్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## దుండిగల్ సర్కిల్లో మూడు డివిజన్లు

### అభ్యంతరాలు, సూచనల స్వీకరణకు వారం రోజుల గడువు

**దుండిగల్, డిసెంబర్ 12 ప్రభాతవార్త:** శివారు మున్సిపాలిటీలను జిహెచ్ఎంసిలో విలీనం చేసిన నేపథ్యంలో ప్రభుత్వం పాత కొత్త డివి జన్లను ప్రకటించింది. ఇందులో భాగంగా దుండిగల్ సర్కిల్లో దుండిగల్, భౌరంపేట, బహాదూర్‌పల్లిగా మూడు డివిజన్లను చేశారు. దుండిగల్ డివిజన్ పరిధిలో దుండిగల్, నాగులూర్, గాగిల్లాపూర్, చర్చిగాగిల్లాపూర్, శంభీపూర్, కేవివార్ వ్యాలీ, భౌరంపేట డివిజన్‌లో పరిధిలో భౌరం పేట, మల్లంపేట, సతీష్ సొసైటీ, సింహపురికాలనీ, లహరీగ్రీన్ పార్కు, డిపి.పల్లి సర్వేనంబర్ 168, రాజరాజేశ్వరకాలనీ, అపురూప కాలనీ, సారేగూడెం, బహాదూర్‌పల్లి డివిజన్ పరిధిలో దుండిగల్ డబుల్ ఇండ్ల సముదాయం, దొమ్మరపోచంపల్లి విలేజ్, సర్వేనంబర్ 120 కాలనీలు, శంకర్‌నగర్, బహుదూర్‌పల్లి గ్రామం పరిధిలను చేర్చారు. ఇందుకు సంబంధించి డ్రాఫ్ట్ లిస్టును దుండిగల్ సర్కిల్ కార్యాలయంలోని నోటుసు బోర్డులో పెట్టారు.

అభ్యంతరాలు, సూచనలు ఏమైనా ఉంటే వారం రోజుల్లోగా సర్కిల్ కార్యాలయంలోని రిసిప్షన్ సెంటర్‌లో ఇవ్వాలని డిసి వెంకటేశ్వర్‌నాయక్ తెలిపారు.




ఫ్యూచర్‌సిటీలో గ్లోబల్ సమ్మిట్ అనంతరం స్టాళ్ల సందర్శనార్థం వచ్చిన విద్యార్థులు

# వార్డుల విభజనపై అభ్యంతరాలు..!

- * అన్నివార్డులు, సర్కిల్ కార్యాలయాల్లో కౌంటర్లు
- * ప్రత్యేక సిబ్బంది ద్వారా ఫిర్యాదుల స్వీకరణ
- * జిహెచ్ఎంసి కమిషనర్‌ను కలిసిన ఎంఐఎం ఎమ్మెల్యేలు
- * వార్డుల విభజనలో మార్పులు చేర్పులు చేయాలని సూచన
- * మేయర్ విజయలక్ష్మితో బిజెపి కార్పొరేటర్లు భేటీ
- * పారదర్శకంగా చేయకపోతే ఆందోళన చేస్తామని వెల్లడి
- * వారం రోజుల్లో జిహెచ్ఎంసి కౌన్సిల్ మీటింగ్
- * డీలిమిటేషన్, బడ్జెట్‌పై చర్చించే అవకాశం




**హైదరాబాద్, డిసెంబరు 10, ప్రభాతవార్త:** శివారు ప్రాంతాల్లోని 20 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లను జిహెచ్ఎంసిలో విలీనం చేసిన విషయం తెలిసిందే. గతంలో ఉన్న వార్డులతో పాటు కొత్తగా జీహెచ్ఎంసీ కలిసిన మున్సిపాలిటీలన్నింటిని కలిపి 300 వార్డులుగా విభజిస్తూ జిహెచ్ఎంసి గత రెండు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే పునర్విభజన డ్రాఫ్ట్, వార్డుల సరిహద్దులతో కూడిన సమాచారాన్ని మంగళవారం విడుదల చేశారు. ఈ నేపథ్యంలో పునర్విభజనపై అభ్యంతరాలను, సలహాలను స్వీకరించే ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. ఇందుకు అధికారులు 7 రోజుల సమయం కేటాయించారు. దీంతో జిహెచ్ఎంసి పరిధిలోని అన్ని సర్కిల్, జోనల్ కార్యాలయాలతో పాటు, ప్రధాన కార్యాలయంలోనూ కౌంటర్లను ఏర్పాట్లు చేసి ఫిర్యాదులను స్వీకరిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఎంఐఎం పార్టీకి చెందిన ఐదుగురు ఎమ్మెల్యేలు జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్‌ను కలిసి పలు సూచనలు చేశారు. పాతబస్తీలోని వార్డులలో చేయాల్సిన మార్పులు చేర్పులపై చర్చించడంతోపాటు.. ఎంఐఎంకు కంచుకోటగా ఉన్న చార్మినార్ జోన్‌లోని పలు వార్డులపై అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు తెలిసింది. అలాగే కొందరు బీజేపీ కార్పొరేటరు సైతం మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని కలిసి పునర్విభజన ప్రక్రియ అశాస్త్రీయంగా ఎంఐఎం పార్టీకి అనుకూలంగా జరుగుతుందని ఆరోపించారు. పునర్విభజన పారదర్శకంగా ఖచ్చితంగా ప్రామాణికంగా పెట్టుకున్న 45 వేల జనాభా, పది శాతం తక్కువ, ఎక్కువతో జరిగేలా ఆదేశాలివ్వాలని లేనిపక్షంలో వరుస ఆందోళన కార్యక్రమాలను చేపట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు.

**కమిషనర్‌తో మేయర్ సుదీర్ఘ చర్చలు..**

ఒకవైపు డీలిమిటేషన్ ప్రక్రియను చేపడుతూనే, దానికి సమాంతరంగా విలీనమైన 27 సర్కిళ్లతో కలిపి వచ్చే ఆర్థిక సంవత్సరంకు సంబంధించిన బడ్జెట్ రూపకల్పన చేస్తున్నారు అధికారులు. ఈ నెల 11న జరగాల్సిన స్టాండింగ్ కమిటీ 18కి వాయిదా పడటంతో స్టాండింగ్ కమిటీలో పునర్విభజన డ్రాఫ్ట్, బడ్జెట్‌పై కౌన్సిల్ సమావేశం నిర్వహించే అంశంపై బుధవారం సాయంత్రం కమిషనర్ ఆర్.వి.కర్ణన్ జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని కలిసి సుదీర్ఘంగా చర్చించారు. ప్రధాన కార్యాలయంలోని 7వ అంతస్తులో దాదాపు 2 గంటల పాటు సమావేశమయ్యారు. ముఖ్యంగా పునర్విభజనకు సంబంధించి ఎంఐఎం, బీజేపీలకు చెందిన ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన అభ్యంతరాలపై వారు చర్చించినట్లు తెలిసింది. అలాగే వచ్చే ఆర్థిక సంవత్సర బడ్జెట్‌కు, డీలిమిటేషన్ డ్రాఫ్ట్‌లకు వేర్వేరుగా కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించకుండా జనవరి మాసంలో ఒక రోజు సమావేశం నిర్వహించి బడ్జెట్‌తోపాటు డీలిమిటేషన్ డ్రాఫ్టును ప్రవేశపెట్టి పాలక మండలి సూచనలు, సలహాలను తీసుకోవాలనే దానిపై ఇరువురి మధ్య చర్చ జరిగినట్లు తెలుస్తోంది.

# గ్యాస్ గోదాం నిర్మాణ పనులను నిలిపివేయాలి

## ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్



అల్లా ఉద్దీన్ కోటీలో వివిధ శాఖ అధికారులతో పర్యటించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

**సంజీవరెడ్డినగర్, డిసెంబర్ 10 ప్రభాతవార్త:** జనవాసాల మధ్య గ్యాస్‌గోదాం నిర్మాణం పనులను వెంటనే నిలిపివేయాలని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధికారులను ఆదేశించారు. సనత్‌నగర్‌లో అల్లా ఉద్దీన్ కోటీలో ఇళ్లకు ఆనుకొని భారత గ్యాస్ గోదాం నిర్మిస్తున్నారని స్థానికులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను ఇటీవల కలిసి ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం ఎమ్మెల్యే తలసాని వివిధశాఖల అధికారులతో కలిసి అల్లా ఉద్దీన్ కోటీ ప్రాంతంలో పర్యటించి గ్యాస్ గోదాం నిర్మాణం జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు నివసించే ప్రాంతంలో, నివాసాల మధ్య గ్యాస్ గోదాంకు ఎలా అనుమతులు ఇస్తారని అధికారులను ప్రశ్నించారు. నివాస గృహాల మధ్య నిర్మిస్తున్న గ్యాస్ గోదాం వల్ల భవిష్యత్తులో ప్రమాదాలు ఎవరు బాధ్యత వహిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే అమీర్‌పేటలోని రేణుకనగర్‌లోఉన్న గ్యాస్ గోదాం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్యాస్ గోదాం నిర్మాణానికి ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని, పనులను నిలిపివేసేలా నిర్వాహకులకు నోటీసులు జారీచేయాలన్నారు. లేనిపక్షంలో స్థానిక ప్రజల నుండి తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కో వాల్సి వస్తుందని స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో ఇక్కడ గ్యాస్ గోదాం ఏర్పాటు చేయడాన్ని అడ్డుకొని తీరు తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిసి శ్రీనివాస్, హైడ్రా అధికారి మోహన్‌రావ్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ సురేశ్, ఏఈ జమీల్, సివిల్ సప్లైయ్ అధికారి జ్యోతి, సనత్‌నగర్ డివి జన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొలను బాల్‌రెడ్డి, సీనియర్ నాయ కులు ప్రవీణ్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ఖలీల్, కరీం లాలా, ఫాజిల్, రాజేశ్ ముదిరాజ్, అష్రాఫ్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.


**కమిషనర్‌తో మాట్లాడిన ఎమ్మెల్యే...**

సనత్‌నగర్‌లోని అల్లా ఉద్దీన్‌కోటీలో జనవాసాల మధ్య గ్యాస్ గోదాం నిర్మాణంకోసం జిహెచ్ఎంసి ఇచ్చిన అన్ని అనుమతులను వెంటనే రద్దు చేయా లని, జరుగుతున్నపనులను అడ్డుకోవాలని ఎమ్మెల్యే తలసాని జిహెచ్ఎంసి కమిషనర్ కర్ణన్‌ను కోరారు. గ్యాస్ గోదాం ప్రాంతంలో పర్యటించిన ఎమ్మెల్యే తలసాని అక్కడి నుంచి ఫోన్‌లో మాట్లాడారు.

గోదాం నిర్మాణం కోసం ఇచ్చిన అనుమతులను తక్షణమే రద్దు చేయాలని కమిషనర్‌తో పాటు అన్ని శాఖల అధికారులకు లేఖలను అందజేశారు. తల సాని ఆదేశాలతో గ్యాస్ గోదాం నిర్మాణం పనులను నిలిపివేయాలని అధికారులు నిర్వాహకులను ఆదేశించారు.

# వరద ముప్పులేని నగరమే అందరి లక్ష్యం

## * ఏప్రిల్ నాటికి డీసిల్టింగ్ పనులు పూర్తి చేయాలి * హైడ్రా కమిషనర్ రంగనాథ్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రంగనాథ్, జిహెచ్ఎంసి ఛీఫ్ ఇంజనీర్ రత్నాకర్

**హైదరాబాద్, డిసెంబరు 10, ప్రభాతవార్త:** "అసాధారణ వర్షాలు పడుతున్నాయి.. ఒకే రోజు 10 నుంచి 20 సెంటీమీటర్ల వర్షపాతం నమోదవుతుంది. ఇలాంటి తరుణంలో వరద నీరు సాఫీగా సాగేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. వరద ముప్పులేని నగరం అందరి లక్ష్యం కావాలి" అని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. జిహెచ్ఎంసి మెయింటినెన్స్ విభాగం ఆధ్వర్యంలో జనవరి నుంచి ప్రారంభంకానున్న డిసిల్టింగ్ పనుల నేపథ్యంలో జీహెచ్ఎంసీ మెయింటినెన్స్-హైడ్రా అధికారులతో కోఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాకాలం ఆరంభంలో కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నా తర్వాత వరద నియంత్రణలో విజయవంతమయ్యామన్నారు. క్యాచ్ పిట్లు, కల్వర్టులలో సిల్ట్‌ను తొలగించేదే హైడ్రా పని అయినప్పటికీ..ప్రధాన నాలాల్లో పూడికను కూడా తొలగించామన్నారు. ఈ వర్షాకాలంలో అనుభవంలోకి వచ్చిన సమస్యలు ఎన్నో పాఠాలు నేర్పాయని.. వచ్చే ఏడాది మరింత సమర్థవంతంగా పని చేయడానికి ఇవన్నీ ఊతమిస్తాయన్నారు. డీసిల్టింగ్ పనులను ఏప్రిల్ నాటికి పూర్తి చేసి.. వరద నీరు సాఫీగా సాగడానికి హైడ్రా సహకారం అన్ని విభాగాలకు అందుతుందన్నారు. అలాగే నాలాల్లో డీసిల్టింగ్ పనులను జనవరి నుంచే మొదలు పెడుతున్నాం వీటి పర్యవేక్షణలో స్థానికులతోపాటు.. ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేద్దామని రంగనాథ్ అధికారులకు సూచించారు. నాలా నెట్‌వర్కుకు ఎక్కడైనా ఆటంకాలతోపాటు.. ముంపు ప్రాంతాల సమస్యను పరిష్కరించడంలో స్థానికులను భాగస్వామ్యం చేయాలన్నారు. అప్పుడే వాటి నిర్వహణలో అందరూ జాగ్రత్తలు పడతారన్నారు. బస్తీబాట కార్యక్రమాన్ని చేపట్టి నాలాల్లో పూడిక తీసేపనుల్లో స్థానికుల సహకారం అందేలా హైడ్రా చర్యలు తీసుకుందన్నారు. అలాగే నాలాల్లో పూడిక తీసే పనుల్లో ఎలాంటి రాజీ పడాల్సినవసరం లేదని హైడ్రా కమిషనర్ అధికారులకు స్పష్టం చేశారు. ఇది తమ పరిధిలోకి రాదని.. ఇంత పూడికను మేము తీయమని కాంట్రాక్టర్లు అనడానికి వీలు లేకుండా.. పనులు పూర్తి చేయాలని సూచించారు. అమీర్‌పేట్‌లోని మైత్రివనం వద్ద పూడుకుపోయిన భూగర్భ డ్రైనేజీ లైన్లను క్లియర్ చేయడం.. సికింద్రాబాద్‌లోని ప్యాట్నీ నాలాపై ఉన్న ఆక్రమణలు తొలగించి విస్తరించడం ఆరెండు ప్రాంతాల్లో వరద ముప్పు లేకుండా చేసిన విషయాన్ని కమిషనర్ ఈసందర్భంగా గుర్తు చేశారు. ఒకరిద్దరి సమస్యకంటే వందలు, వేలాది మంది సమస్య పరిష్కారమే లక్ష్యంగా పని చేయాల్సి ఉందన్నారు. అలాగే నాలాల్లో పూడికను తొలగించడం ఎంత ముఖ్యమో.. వాటి నిర్వహణకు అంతే ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉందన్నారు. సమావేశంలో హైడ్రా అదనపు డైరెక్టర్ వర్ల పాపయ్య, జీహెచ్ ఎంసీ మెయింటినెన్స్ చీఫ్ ఇంజినీర్ రత్నాకర్, ఎస్ఎన్‌డీపీ ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ జ్యోతిర్మయితో పాటు పలువురు జీహెచ్ఎంసీ ఇంజినీర్లు, హైడ్రా అసెట్ ప్రొటెక్షన్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు

# చిత్రపురి కాలనీ అభివృద్ధిని ఆపేది లేదు

## కాలనీ మాజీ అధ్యక్షుడు వల్లభనేని అనిల్‌కుమార్




మాట్లాడుతున్న వల్లభనేని అనిల్ కుమార్

**నార్సింగి, డిసెంబరు 10 ప్రభాతవార్త :** నాపై ఎన్ని నిందలు వేసినా, ఆరోపణలు చేసినా, జైలుకుపంపినా చిత్రపురి కాలనీని అభివృద్ధి చేయడం మాత్రం ఆపబోనని మాజీ అధ్యక్షులు వల్లభనేని అనిల్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం మణికొండలోని చిత్రపురికాలనీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ ఐదేళ్లుగా మా కమిటీ నీతి, నిజయితీలతో పనిచేసిందని, అర్హులైన సినీ కార్మికులకు ఇళ్లు నిర్మించి ఇచ్చిందని వివరించారు. ఐదారుగురు వ్యక్తిగత లబ్ధిని కాదన్నామని ఆధారాలు లేని ఆరోపణలు చేస్తూ, కోర్టులలో కేసులు వేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఈ విషయం కాలనీలోని సభ్యులందరికి తెలుసన్నారు. గతంలో అధ్యక్ష పదవికి ఒకరు రెండుమార్లు మాత్రమే పోటీ చేయవచ్చున్న నిబంధన ఉండేదని, జెనరల్ బాడీ సమావేశంలో సభ్యులందరి సూచనల మేరకు ఒకరు ఎన్నిమార్లయినా పోటీ చేయవచ్చున్న నిబంధనలను బైలాలో చేర్చామని వివరించారు. మా కమిటీ బాధ్యతలు చేపట్టే నాటికి చిత్రపురిలోని ఎంఐజి, హెచ్ఐజి, ఎల్ఐజీలలో కనీస అవసరాలైన మంచినీరు, భూగర్భ డ్రైనేజి, వీధి దీపాలు సరిగ్గా లేవన్నారు. రాజకీయ నాయకులు, సినీ ప్రముఖులు, ప్రభుత్వ పెద్దలను అనేకమార్లు కలిసి 24 గంటల పాటు మంజీరా నీరును సరఫరా చేయిస్తున్నామని, రోడ్లు, పార్కులు, మైదానాలు, భవనాలు నిర్మించామని వివరించారు. ప్రస్తుతం జీతాలు ఇచ్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నామన్నారు. సొసైటీ అభ్యున్నతికి మేము రేయింబళ్లూ కష్టపడుతున్నామని, మాకు అడ్డుపడకుండా, సహకరించాలని హితవు పలికారు. కేసులు వేసి ఇబ్బందులకు గురిచేయడం వల్ల సొసైటీ డబ్బులు వృథా అవుతున్నాయని, కట్టిన విల్లాలను కూల్చివేయడం వల్ల సొసైటీ డబ్బులే నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. 67 ఎకరాల స్థలంలో చిత్రపురి కాలనీ ఉందని, ఇక్కడ 4,600 మంది ఓటర్లు ఉన్నారని, మా పదవీకాలం ముగిసిందని, వచ్చేనెల రోజుల వ్యవధిలో ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని, ఎన్నికల కోసం మా కమిటీ పూర్తి సిద్ధంగా ఉందన్నారు. చిత్తశుద్ధి, విజన్, ప్లానింగ్‌తో మా కమిటీ పనిచేస్తుందని, సినీ కార్మికులంతా మావెన్నంటే ఉన్నారని, ఎన్నికలు నిర్వహిస్తే అది నిరూపితం అవుతుందన్నారు. సభ్యులు మళ్లీ మాకు అవకాశం కల్పిస్తే మా పనితీరు బాగున్నట్లని, ఓడిస్తే పనితీరు బాగాలేదని మేము భావిస్తామన్నారు. కమిటీ కేవలం 16 మందికి మాత్రమే కొత్తగా సభ్యత్వం ఇచ్చిందని, ఏ పని చేసినా డిడిల ద్వారానే చేశామని, ఎక్కడా నగదుతో పనిచేయలేదని, ఇంత పారదర్శకంగా పని చేస్తే అవినీతి ఎలా జరుగుతుందో సభ్యులు గ్రహించాలన్నారు. మా కాలనీ సభ్యులను పూర్తిగా నమ్ముతున్నాము, వారి సంక్షేమంకు కట్టుపడి ఉన్నాము ఐదారుగురు చేసే అసత్య ఆరోపణలు పట్టించుకోబోమని స్పష్టం చేశారు. సొసైటీలో ఉన్న 175 కోట్ల అప్పు తీర్చాలంటే ఒక్కొక్కరిపై రూ.5లక్షల భారం పడుతుందన్నారు. ఈ భారంను తగ్గించేందుకు కొత్త ప్రాజెక్టు నిర్మించేందుకు అనుమతి పొందామని తెలిపారు. ఎవరెన్ని విధాలుగా బెదిరించినా వెనక్కి తగ్గేది లేదని, సినీ కార్మికులకు మేలు చేసేదాకా ముందుండి పని చేస్తామని వల్లభనేని అనిల్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సభ్యులు దొర, లలిత, రామకృష్ణ ప్రసాద్, అలరహరి, బత్తులు రఘు, వేణుగోపాల్‌రావ్, రమేష్‌బాబు, నిమ్మగడ్డ అనిత తదితరులు పాల్గొన్నారు.


జపాన్ నుంచి వచ్చిన అభిమానులతో రాంచరణ్

## జపాన్ అభిమానులను కలిసిన సినీనటుడు రాంచరణ్

**జూబ్లీహిల్స్, డిసెంబరు 10, ప్రభాతవార్త:** జపాన్‌నుంచి హైదరాబాద్‌కు వచ్చిన పలువురు అభిమానులను సినీ నటుడు రాంచరణ్ కలిశారు. జపాన్ నుంచి నగరానికి వచ్చిన తన అభిమానులను జూబ్లీహిల్స్‌లోని తన నివాసానికి ఆహ్వానించారు. వారితో ఆయన ఆత్మీయంగా మాట్లాడారు. ఈ సందర్భంగా రాంచరణ్‌తో మాట్లాడేందుకు జపాన్ నుంచి వచ్చిన వారు ఒక ట్రాన్స్‌లేటర్‌ను సైతం తీసుకొచ్చారు. ఈ సందర్భంగా జపాన్ నుంచి వచ్చిన ఒక అభిమాని తాను ఆర్‌ఆర్‌ఆర్ చిత్రాన్ని 100 సార్లకు పైగా చూసినట్లు చెప్పగా ఏదైనా ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో చూశారా అంటూ రాంచరణ్ అడిగారు. అందుకు ఆమె మాట్లాడుతూ తానేకాదు.. చాలా మంది ప్రతి రోజు ఈ సినిమా చూస్తుంటారని, అదీ సినిమాహాళ్లలోనే అంటూ సమాధానమిచ్చారు. ఈ మాటలకు రాంచరణ్ షాక్ అయ్యారు. మరికొందరు అభిమానులు తమతోపాటు తీసుకొచ్చిన అనేక బహుమతులను రాంచరణ్‌కు అందించారు. దీనికితోడు వీరంతా 'కన్మని టూర్' పేరుతో రాంచరణ్ నటించిన మగధీర షూటింగ్ ప్రాంతాలను సందర్శించినట్లు తెలిపారు. చరణ్ కనుబొమ్మలు అంటే తనకు ఎంతో ఇష్టమని ఒక అభిమాని చెప్పగా, తాను ఇచ్చిన బొమ్మ ఇంకా చరణ్ వద్ద ఉందని తెలుసు కున్న మరోఅభిమాని ఆనందబాష్పాలు రాల్చారు. ఈ సందర్భంగా పెద్ది చిత్రానికి సంబంధించిన డ్రెస్సింగ్‌తో కొందరు చరణ్ వద్దకు వచ్చారు. ఈ సందర్భంగా రాంచరణ్ తల్లి సురేఖ జపాన్ నుంచి వచ్చిన బృందాన్ని ఆప్యాయంగా పలకరించారు.

### ఓం ప్రకాష్ బిస్వాకు ఎపిజె అబ్దుల్ కలాం గ్లోబల్ ఐకాన్ అవార్డు


ఓంప్రకాష్‌బిస్వాను సన్మానిస్తున్న దృశ్యం

**గన్‌ఫౌండ్రి, డిసెంబరు 10, ప్రభాతవార్త:** సోషల్ జస్టిస్ ఫర్ వర్డల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో బుధవారం బొగ్గులకుంటలోని పరిషత్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఉత్తమ సంఘ సేవకులుగా, రాజకీయ పరంగా ప్రజలకు సేవలను అందించిన తెలంగాణ బిజెపి దళిత రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓంప్రకాష్‌బిస్వాకు డాక్టర్ ఏ.పి.జె అబ్దుల్ కలాం గ్లోబల్ ఐకాను అవార్డును అందచేశారు. కార్యక్రమంలో వర్డల్‌బుక్ ఆఫ్ రికార్డు హోల్డర్ చైర్మన్ డాక్టర్ కొప్పుల విజయ్‌కుమార్, కె.రవిబాబు పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మానవహక్కుల పరిరక్షణ అందరి బాధ్యత


మాట్లాడుతున్న ఆచార్య నాగేశ్వరరావు

**శేరిలింగంపల్లి, డిసెంబరు 10 ప్రభాతవార్త :** మానవహక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని మౌలానా అజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ రాజనీతిశాస్త్ర విభాగ అదిపతి ఆచార్య నాగేశ్వరరావు పేర్కొన్నారు. ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బిహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు మానవ హక్కులపై అవగాహన కార్యక్రమాన్ని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామియాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా ఆచార్య నాగేశ్వరరావు హాజరై మాట్లాడుతూ, మానవహక్కులనేవి ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కులకు ఉద్దేశించబడనవి, ప్రపంచంలో పౌర రాజకీయ హక్కలకు సంబందించి అంతర్జాతీయ ఒడంబడికలపై అవగాహన కల్పించటానికి డిసెంబర్ 10వ తేదిన ఒక అంశాన్ని ప్రాతిపదికగా తీసుకుని ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల దినోతవ్సాన్ని నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.రవీందర్, ఆచార్య సోమరాజు, అధ్యాపకులు మహ్మద్‌యూనస్, సయ్యద్ మక్సూద్, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శివరామకృష్ణ, అమ్మయ్య చౌదరి, జనార్ధన్, పాలం శ్రీను, ప్రేమ్ సింగ్, కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఛత్రినాక ఎసిపి చంద్రశేఖర్‌కు అభినందన సన్మానం

**చార్మినార్, డిసెంబరు 10 ప్రభాతవార్త :** పాతనగరంలో శాంతి, మత సామరస్యం, జాతీయ సమైక్యతను పెంపొందించటానికి పోలీస్ శాఖ అధికారులు చేస్తున్న కృషి అభినందనీయమని తెలంగాణ మేధావుల ఫోరం అధ్యక్షులు డాక్టర్.రాజ్‌నారాయణ ముదిరాజ్ అన్నారు. ఫోరం తరుపున ఛత్రినాక ఏసిపి సిహెచ్.చంద్రశేఖర్, మొగల్‌పుర ఇన్‌స్పెక్టర్ సి.శ్రీను, ఛత్రినాక ఇన్‌స్పెక్టర్ కెఎన్ శివ ప్రసాద్ వర్మ, శాలిబండ ఇన్‌స్పెక్టర్ మహేష్ గౌడ్‌ను తెలంగాణ మేధావుల ఫోరం శాఖ తరుపున అధ్యక్షులు డాక్టర్.రాజ్‌నారాయణ ముదిరాజ్ అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్ మాట్లాడుతూ పాతబస్తీలో ప్రశాంతమైన వాతావరణలో పండుగలు, ఊరేగింపులు జరగటానికి పోలీస్ శాఖ అధికారులు చేస్తున్న కృషి అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ జి.వేణుగోపాల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## పండగ సాయన్నకు ఘన నివాళులు

**శేరిలింగంపల్లి, డిసెంబరు 10 ప్రభాతవార్త :** పేదల శ్రేయస్సుకు పండగ సాయన్న చేసిన సేవలు చిరస్మరణీయమని బీసీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు భేరి రామచందర్‌యాదవ్ అన్నారు. బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో నేతాజీనగర్‌లోని బీసీ ఐక్యవేదిక కార్యాలయంలో పండగ సాయన్న వర్థంతి వేడుకలను నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర బీసీ ఫెడరేషన్ అధ్యక్షుడు ఆర్కే సాయన్నముదిరాజ్, రాష్ట్ర బీసీ ఐక్యవేదిక అద్యక్షులు బేరి రామచందర్‌యాదవ్ జాతీయ యువత అద్యక్షులు కిరణ్‌కుమార్, మహాసభ యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివముదిరాజ్ తదితరులు పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక ఆర్గనైజింగ్ సెక్రటరీ హరికృష్ణచారి, సైదులు, బి.సాయిలుయాదవ్, రమేశ్‌ముదిరాజ్, మధుముదిరాజ్, బేరి చంద్రశేఖర్‌యాదవ్, మనోజ్ కుమార్‌ముదిరాజ్, కృష్ణగౌడ్, బీసీ సంఘం నాయకులు, యూనివర్సీటీ శివముదిరాజ్, జాతీయ యువత అధ్యక్షులు కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


పండుగ సాయన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

# 42 శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ వైఖరి తెలపాలి

బిసి పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగౌని బాలరాజ్‌గౌడ్

**హైదరాబాద్, డిసెంబరు 10, ప్రభాతవార్త:** పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమై 10 రోజులు గడుస్తున్నా, తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న పార్లమెంట్ సభ్యులు ఎవరూ 42శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లు గురించి మాట్లాడటం లేదని, అసలు 42 శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ తన వైఖరి ఏమిటో తెలపాలని బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగౌని బాలరాజ్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం చిక్కడపల్లిలోని కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 42 శాతం రిజర్వేషన్లతోనే స్థానిక ఎన్నికలు నిర్వహిస్తామన్న రేవంత్‌రెడ్డి మాటలు నీటి మూటలేనా అని ప్రశ్నించారు. తక్షణమే పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి, 9వ షెడ్యూల్డ్‌లో చేర్చాలని, విద్య, ఉద్యోగాలలో బీసీలకు రావల్సిన వాటా అమలుచేయాలని డిమాండ్ చేశారు. బీసీలపై ఉన్న క్రిమిలేహర్ విధానాన్ని ఎత్తివేయాలని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటుచేయాలని, బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు అమలు చేయాలని, బీసీ అట్రాసిటీ తీసుకురావాలని, మహిళా బిల్లులో బీసీ మహిళా కోటా ఎంతో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వైస్ చైర్మన్ దుర్గయ్యగౌడ్, కన్వీనర్లు అయిలి వెంకన్నగౌడ్, భైరు శేఖర్, ఎలికట్టె విజయ్ కుమార్ గౌడ్, అంబాల నారాయణగౌడ్, బోయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోయ గోపి, ఎంబీసీ విద్యార్థి సంఘం అధ్యక్షులు బదేసాబ్, సిటీ సెక్రటరీ పిల్లి శంకర్, గంగపుత్ర సంఘం అధ్యక్షులు సురేష్, సిటీ వైస్ ప్రెసిడెంట్ గాలి సత్యనారాయణ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగౌని బాలరాజ్‌గౌడ్


అవార్డును స్వీకరిస్తున్న దృశ్యం

### ఉత్తమ విద్యాసంస్థలుగా సెయింట్ ఆంథోనీస్‌కు గుర్తింపు

**పేట్‌బషీరాబాద్, డిసెంబర్ 10, ప్రభాతవార్త :** విద్యారంగంలో తన కంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న సెయింట్ ఆంథోనీస్ విద్యా సంస్థలు మరోసారి తమ సత్తా చాటాయి. హైదరాబాద్ ఆర్చిడియోసెస్ పరిధిలో అత్యుత్తమ పనితీరు కనబరిచినందుకు సుచిత్రలోని సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్, కొంపల్లిలోని సెయింట్ ఆంథోనీస్ జూనియర్ కళాశాలలకు ప్రతిష్టాత్మక అవార్డులు వరించాయి. బుధవారం బిషప్ హౌస్‌లో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో హైదరాబాద్ ఆర్చిబిషప్, కార్డినల్ అయిన మోస్ట్ రెవరెండ్ డాక్టర్ పూల ఆంథోనీ చేతుల మీదుగా ఈ అవార్డులను అందజేశారు. జూనియర్ కళాశాల తరపున సంస్థల చైర్మన్ నారిశెట్టి సుందర రాజు ఈ అవార్డును అందుకున్నారు. హై స్కూల్ తరపున అకడమిక్ డైరెక్టర్ నారిశెట్టి రజని సరిత అవార్డును స్వీకరించారు.

### డా. వంగపల్లి విశ్వనాథంకు రావిచెట్టు రంగారావు

## తెలుగుభాషా వికాస పురస్కారం ప్రదానం


వంగపల్లి విశ్వనాథంను పురస్కారంతో సత్కరిస్తున్న మంత్రి రామారావు, రమణాచారి, ఉడయవర్లు, వసుంధరరెడ్డి తదితరులు

**నాంపల్లి, డిసెంబరు 10 ప్రభాతవార్త :** శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం విద్యా దేవాలయమని తెలంగాణ సారస్వత పరిషత్తు కోశాధికారి మంత్రి రామారావు అన్నారు. ఈ భాషానిలయాన్ని స్థాపించి తెలుగుభాషా వికాసానికి అవిరళ కృషిచేసిన రావిచెట్టు రంగారావు 149వ జయంతి ఘనంగా జరుపుకోవడంతోపాటు ఆయన పేరున భాషానిలయం పురస్కారం సుప్రసిద్ధ విద్యావేత్త, తెలుగుభాషా ప్రియుడు డా. వంగపల్లి విశ్వనాథంకు ప్రదానం చేయడం ఎంతో సబబుగా ఉందని, ఆ సువర్ణావకాశం తనకు రావడం మహదానంగా ఉందన్నారు. శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి భాషానిలయంలోని రావిచెట్టు రంగారావు సభామందిరంలో తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, శ్రీకృష్ణదేవరాయ తెలుగుభాషానిలయం అధ్యక్షుడు డా. కె.వి.రమణాచారి సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి రామారావు విశిష్ట అతిథులు రావిచెట్టు రమాదేవి శివప్రసాద్, వసుంధరారెడ్డి, భాషానిలయం గౌరవ కార్యదర్శి టి.ఉడయవర్లు తదితరులతో కలిసి సుప్రసిద్ధ విద్యావేత్త, వ్యక్తిత్వ వికాస-విలువల బోధకుడు, తెలుగుభాషా ప్రియుడు డా. వంగపల్లి విశ్వనాథంను ఘనంగా సత్కరించి భాషానిలయం వ్యవస్థాపక కార్యదర్శి, వితరణశీలి రావిచెట్టు రంగారావు 149వ జయంతిని పురస్కరించుకుని రావిచెట్టు రంగారావు తెలుగుభాషా వికాస పురస్కారం ప్రదానంచేసి శుభాభినందనలు తెలిపారు. సభకు టి.ఉడయవర్లు స్వాగతం పలికి సన్మాన పత్రాన్ని చదివి వినిపించగా డా. కె.వి.రమణాచారి అధ్యక్షోపన్యాసంలో ఆనాడే తెలుగుభాష కోసం గొప్పగా ఆలోచించి పాటుపడిన మహానుభావులు రావిచెట్టు రంగారావు, రావిచెట్టు లక్ష్మీనర్సమ్మలు సాహితీ సమరంగణ సార్వభౌముడైన శ్రీకృష్ణదేవరాయల పేరిట ఈ భాషానిలయాన్ని స్థాపనకు మూలస్థంభాలని, 125 ఏళ్లుగా ఈ సంస్థ నడుపబడుతుందని గుర్తుచేశారు.

## రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును తక్షణమే ఆపివేయాలి

### సేవ్ మూసీ మూవ్‌మెంట్ ప్రతినిధుల డిమాండ్

**హైదరాబాద్, డిసెంబరు 10, ప్రభాతవార్త:** రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును తక్షణమే ఆపివేయాలని, ప్రజాస్వామ్య ప్రక్రియను పునరుద్ధరించాలని సేవ్ మూసీ మూవ్‌మెంట్ ప్రతినిధి జాన్ మిచేల్ డిమాండ్ చేశారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సేవ్ మూసీ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో క్లైమేట్ ఫ్రంట్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి సొడె అన్వర్, రుచిత్ ఆశాకమల్, పులి కల్పన, సయ్యద్ బిలాల్, శంకర్, పృథ్వీరాజ్, క్రాంతి దళ్, తెలంగాణ విఠల్, శ్రీశైలం, సినీ డైరెక్టర్ సయ్యద్ రఫీలు పాల్గొని ప్రసం గించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నరపతిపాదిస్తున్న మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ప్రత్యామ్నాయ ప్రణాళికను తెలంగాణ యువత డిమాండ్ చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ ప్రణాళికలో మూసీతో ముడిపడి ఉన్న ప్రజలు, సంస్కృతి లేవని, మూసీ నదిని బ్రతికిం చుకోవాలి అన్న ఆలోచనే ప్రభుత్వానికి లేదని ఆరోపించారు. మూసీ పునరుజ్జీ వనం కోసం స్థానిక నిపుణులు, పౌర సమాజంతోకలసి, ప్రజలకు, పర్యావర ణానికి మేలు చేసే విధంగా ప్రణాళిక రూపొందించాలని డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న సేవ్ మూసీ మూవ్‌మెంట్ ప్రతినిధులు

## పౌరాణిక నాటకాలు తెలుగువారి సంపద

### ప్రముఖ సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు

**చిక్కడపల్లి డిసెంబరు 10 (ప్రభాతవార్త) :** శ్రీకృష్ణుడు పాండవులు రాయబారం కోసం దృతరాష్ట్రుని కొలువుకి వెళ్లి దుర్యోధనుని సంధి చేసుకుని పాండవులకు రాజ్య భాగం ఇవ్వమని హితం చెప్పటమే శ్రీకృష్ణ రాయబారం నాటకం తిరుపతి వెంకటకవులు రచించిన కృష్ణ రాయబారం నాటకం లోని పద్యాలను కృష్ణ పాత్రధారి కాటమ రాజు రాగ యుక్తంగా ఆలపించగా అందుకు తగిన విధం గా దుర్యోధన పాత్ర ధారి సాంబశివా రెడ్డి నటన లో పద్య ఆలాపన లో పోటీ పడి నాటకాన్ని రక్తి కట్టించారు. బుధవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై నెల్లుట్ల ఫౌండేషన్ అధర్వం లో శ్రీ కృష్ణ రాయబారం నాటకం ప్రదర్శించారు. ఈ సందర్భం గా శివాని ఆర్ట్స్ అసోసియేషన్ నిర్వాహణలో జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు మాట్లాడుతూ పౌరాణిక నాటకాలు తెలుగు వారి సంపద అన్నారు అట్టి నాటకాలకు నేడు ఆదరణ తగ్గింది అని ఆవేదన వ్యక్తం చేశారు గూడ రామకృష్ణ వంటి సాంస్కృతిక ప్రియులు అరుదు అని అట్టి వారి సహకారం తెలుగు నాటక రంగానికి అవసరం అన్నారు ఈ సందర్భం గా దర్శకుడు సాంస్కృతిక ప్రియులు గూడ రామకృష్ణ ను జీవిత సాఫల్య పురస్కారం తో సత్కరించారు నెల్లుట్ల రవీందర్ రావు బాబా అర్చన ప్రముఖ నటుడు వెంకట కృష్ణ తదితరులు పాల్గొనగా శివాని సంస్థ స్థాపకుడు పరమేశ్వర్ పర్యవేక్షణ చేశారు ఈ సందర్భం గా వనం కవిత శిష్య బృందం కూచిపూడి నృత్య అంశాలు ప్రదర్శించారు.

## పనిచేసే వారికే నామినేటెడ్ పదవి కట్టపెట్టాలి

### బిజెపి అధికార ప్రతినిధి బిఎన్ శ్రీనివాస్

**కంటోన్మెంట్, డిసెంబరు 10 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపా ధ్యక్షుడు సదాకేశవరెడ్డి నామినేటెడ్ పదవి కోసం ఈ నెల 7వ తేదీన బిజెపి తలపెట్టిన ధర్నాలో ప్రత్యేక్షం కావడం హాస్యస్పదంగా ఉందని మహంకాళి జిల్లా బిజెపి అధికార ప్రతినిధి బి.ఎన్.శ్రీనివాస్ తెలిపారు. బుధవారం సికింద్రాబాద్ టిహోలి గార్డెన్‌లో ఆయన మాట్లాడుతూ బిజెపి సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటుందన్నారు. కేశవరెడ్డి బిజెపిలో ఎప్పుడు పనిచేయలేదని తెలి పారు. కంటోన్మెంట్ బోర్డు నామినేటడ్ పదవి వచ్చే ఫిబ్రవరిలో ముగిస్తున్న నందున బోర్డు మెంబర్‌గా ప్రస్తుతం కొనసాగుతున్న బానుక నర్మదమల్లి కార్జున్‌కు మరోసారి పొడగిస్తే తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. నామి నేటెడ్ పదవి కోసం తాను బిజెపి నేతలను అని కండువ కప్పుకుని ఈ నెల 7వ తేదీన ఇందిరా పార్కు వద్దబిజెపి తలపెట్టిన ధర్నాలో ప్రత్యేక్షం కావడం సరైంది కాదన్నారు. పార్టీలో పనిచేసే సీనియర్ నాయకులను గుర్తించి నామి నేటడ్ పదవి ఇవ్వాలని అని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి అసెంబ్లీ కన్వీనర్ విజయానంద్, సీనియర్ నాయకులు టోపీ శంకర్, సతీష్‌కుమార్, రాయల్ కుమార్, వినోద, భాగ్యలక్ష్మి, అనురాధ, సబిత పాల్గొన్నారు.

## 13న రాధాగోవింద రథయాత్ర

**నాంపల్లి, డిసెంబరు 10 ప్రభాతవార్త :** హరేకృష్ణ మూవ్‌మెంట్, హైదరాబాద్ ఆధ్వర్యంలో 13 శనివారం నాలుగో వార్షిక శ్రీశ్రీరాధాగోవింద రథ యాత్ర ఘనంగా నిర్వహిస్తున్నట్లు సంస్థ వారు తెలిపారు. ఈ మేరకు సంస్థ అధ్యక్షుడు సత్యగౌర చంద్రదాస ప్రభూజీ సంబంధిత పోస్టర్‌ను ఆవిష్కరించారు. భారతదేశం సంస్కృతి, ఆధ్యాత్మిక వారసత్వాన్ని ప్రతిబింబించే ఈ పవిత్రోత్సవం అత్యంత సుందరంగా తీర్చిదిద్దిన శ్రీశ్రీ రాధాగోవింద విగ్రహాలు గండిపేట వై జంక్షన్ సమీపంలోని శ్రీకృష్ణ గోసేవా మండల్ గోశాల నుండి నార్సింగి, కోకాపేట ప్రాంతంలోని హరే కృష్ణ హెరిటేజ్ టవర్ వరకు భక్తుల సంస్మరణతో రథయాత్ర కొనసాగుతుందని పేర్కొన్నారు. రథయాత్ర సాయంత్రం 4.30 గంటలకు ప్రారంభమై ఆయా ప్రాంతాలగుండా 7గంటల వరకు సాగుతుందని తెలిపారు. రాత్రి 7గంటలకు హెరిటేజ్ టవర్ చేరుకున్న తర్వాత మెగా కీర్తనలు, హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు సత్యగౌర చంద్ర దాస ప్రభూజీవారి ప్రత్యేక ప్రవచనం ఉంటుందని, 7.30లకు శ్రీశ్రీ రాధా గోవిందలకు హారతిసమర్పించి భక్తులకు ప్రసాదవితరణ ఉంటుందని పేర్కొన్నారు.

## హత్య కేసులో రౌడీషీటర్, మరో ఐదుగురు అరెస్ట్

**చార్మినార్, డిసెంబరు 10 ప్రభాతవార్త :** పాతబస్తీ రెయిన్‌బజార్ ఛోటాపూల్‌లో ఓ వ్యక్తి హత్యకు గురైన సంఘటనలో రెయిన్‌బజార్ పోలీసులు రౌడీషీటర్‌తోపాటు మరో ఐదు మందిని బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న మరో ఆరు మంది కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను దక్షిణ మండలం డిసిపి కిరణ్ ఖరే ప్రభాకర్ బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. యాకుత్‌పురకు చెందిన షేక్ జునైద్ బిన్ మహమూద్ భర్మూస్ (35) బియ్యం అమ్మే షాపులో పనిచేస్తున్నాడు. కాగా షేక్ జునైద్‌కు దగ్గరి బంధువులైన యాకుత్‌పురకు చెందిన ఓమర్ బిన్ అంజా అల్ జాబ్రీ (రెయిన్‌బజార్ రౌడీషటర్), అలి బిన్ అంజాఅల్ జాబ్రీల మధ్య కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఓమర్ బిన్ అంజా అల్ జాబ్రీ (రెయిన్‌బజార్ రౌడీషటర్), అలి బిన్ అంజా అల్ జాబ్రీ (ఇద్దరు అన్నదమ్ములు)లు ఇల్లు అమ్మినా, ఎవరైనా కొనుగోలు చేసిన వారి వద్ద నుంచి డబ్బులు వసూళ్ల చేస్తుంటారు. కాగా హత్యకు గురైన షేక్ జునైద్ స్నేహితుడు ఫారూఖ్ ప్రాపర్టీ కొనుగోలు చేస్తున్న సమయంలో ఓమర్ బిన్ అంజా అల్ జాబ్రీ, అలి బిన్ అంజా అల్ జాబ్రీలు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో షేక్ జునైద్ అడ్డు వచ్చాడు. ఏలాగైనా జునైద్‌ను చంపాలని వారు పథకం వేశారు. ఈ నెల మూడవ తేదీ రాత్రి ఛోటాపూల్ వద్ద జునైద్‌పై కత్తులతో దాడి చేసి హత్య చేశారు. ఈ హత్య కేసులో పోలీసులు పన్నెండు మందిని నిందితులు గాగుర్తించారు. ఒమ్మర్ బిన్ హంజా (35), అలి బిన్ హంజా (31), ఫైసల్ బిన్ హబీబ్ అహ్మద్ (23), మహ్మద్ మక్సూద్ (28), సయ్యద్ అస్గర్ (20), మహ్మద్ తాహెర్ (25')లను పోలీసులు అరెస్ట్ చేసిరిమాండ్‌కు తరలించారు. వారినుంచి కత్తులు స్వాధీనం చేసుకున్నారు. కాగా సయ్యద్ రెహ్మాన్ ఘోరీ, మలిక్ బిన్ జావిద్, అజర్, జుబేర్, రియాన్, కుల్సుంలు పరారీలో ఉన్నారు. సమావేశంలో దక్షిణ మండలం అడిషనల్ డిసిపి ఎంఎ మాజిద్, మీర్‌చౌక్ ఏసిపి శ్యామ్ సుందర్, రైన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్ నేతాజి పాల్గొన్నారు.

### దేవిబాగ్‌లో వ్యక్తి దారుణ హత్య

**చార్మినార్, డిసెంబరు 10 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీలో ఓ వ్యక్తి దారుణ హత్యకుగురైన సంఘటన కామాటిపుర పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ భాస్కర్ కథనం ప్రకారం, కిషన్‌బాగ్‌కు చెందిన అరవింద్ ఘోస్లే(33) బియ్యం షాపులో పనిచేస్తున్నాడు. అరవింద్ ఘోస్లే మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనంపై దేవిబాగ్ నుంచి కిషన్‌బాగ్ వెళుతున్నాడు. అదే సమయంలో గుర్తు తెలియని కొంత మంది వ్యక్తులు దాడి చేసి అరవింద్ ఘోస్లేను హత్య చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని అరవింద్ మృత దేహాన్ని స్వాధీనం చేసుకుని ఉస్మానియా మార్చురికి తరలించారు. కాగా వివాహేతర సంబంధమే అరవింద్ ఘోస్లే హత్యకు కారణం అయి ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. కేసుకు సంబంధించి కొంత మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ కేసును కామాటిపుర పోలీసులు అన్ని కోణాలు నుంచి దర్యాప్తు చేస్తున్నారు.


మాట్లాడుతున్న వల్లభనేని ప్రసాద్

## జనాభా ప్రాతిపదికగా రిజర్వేషన్లు కల్పించాలి

### డెవలెప్‌మెంట్ ఫర్ ది డీఫ్ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్

**చిక్కడపల్లి, డిసెంబరు 10 (ప్రభాతవార్త):** దేశంలో అన్ని రాష్ట్రాలలో బిసి జనాభా ప్రాతిపదికగా రిజర్వేషన్‌లు కల్పించాలని డెవలెప్‌మెంట్ ఫర్ ది డీఫ్ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ డిమాండ్ చేశారు. ఇందులో భాగంగానే 2026 జనవరిలో చలోఢిల్లీ కార్యక్రమంలో భాగంగా మహాధర్నా చేపట్టాలని నిర్ణయించినట్లు బుధవారం చిక్కడపల్లిలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. దేశంలో వివిధ రాష్ట్రాలలో బిసి వివిధ వర్గాల కులస్తులు 151 కోట్ల పైగా జనాభా వున్నారని, తెలంగాణ రాష్ట్రంలో ఎలాగైతే 42 శాతం కేటాయించారో అదేతరహాలో వివిధ రాష్ట్రాల్లో జనాభా ప్రదీపకంగా రిజర్వేషన్ అవకాశం ఇవ్వాలని కేంద్రం రాష్ట్రాల ప్రభుత్వా లకు విజ్ఞప్తి చేసారు. దేశంలో అన్ని రాష్ట్రాలలో దివ్యంగులకు గ్రామ వార్డు సభ్యుల నుండి పార్లమెంట్ స్థాయి వరకు చట్ట సభ వరకు రిజర్వేషన్ ఇవ్వాలని, దేశంలో అన్ని రాష్ట్రాలలో కేంద్రం ప్రభుత్వం ఇస్తున్నరూ. 300 నుంచి రూ.3000 లకు పెంచి దివ్యంగుల మొత్తం రూ. 10 వేలు పెన్షన్ పెన్షన్ ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తారు, లేని పక్షములో బీసీలు దివ్యంగులు తరుపున అన్ని రాష్ట్రాల నుండి తరలి వచ్చి ఢిల్లీ లో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో డెవలప్మెంట్ ఫర్ ది డీఫ్ జాతీయ కో కన్వీనర్ కాటమోని వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వస్థలాలను కబ్జా చేస్తే సహించేదిలేదు

### గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్

**చిక్కడపల్లి డిసెంబరు 10 (ప్రభాతవార్త) :** గాంధీనగర్ డివిజన్‌లో ఎవరైనా ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తే సహించేదిలేదని కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం గాంధీనగర్ డివిజన్ ఎస్ఆర్‌టి లోని 300 గజాల ప్రభుత్వ ఖాళీ స్థలం కబ్జాకు గురవుతుందని స్థానికులు పావని వినయ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. కార్పొరేటర్ సూచనల మేరకు బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. తమకు అందిన ఫిర్యాదు మేరకు మండల రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి, వివరాలపై సమీక్షించి ఖాళీ స్థలంలో ప్రభుత్వ బోర్డును ఏర్పాటు చేయించి కబ్జా బారినుండి కాపాడమని అన్నారు. డివిజన్‌లో ఎక్కడైన ప్రభుత్వ స్థలాలను కబ్జాచేస్తే అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని వినయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసే అక్రమదారులు ఎవరైనా సరే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానికులు పి.రాజేశ్వర్ రావు, పవన్, శ్రీనివాస్, అశోక్, సక్కుబాయి, పద్మ, మంజుల, రాధ, శ్రీదేవి, లింగమ్మ, నిమాయి మరియు బిజెపి నాయకులు, ఆనంద్ రావు, సాయి కుమార్, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా స్వామి శరణం అయ్యప్ప పడిపూజ

**చిక్కడపల్లి డిసెంబరు 10(ప్రభాతవార్త):** అయ్యప్ప శరణుఘోషతో బుధవారం గాంధీనగర్ వీధులు మారుమ్రోగాయి. స్థానిక బిజెవైఎం నాయకుడు ప్రశాంత్ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి పడి పూజ కార్యక్రమం జరిగింది. స్థానిక కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్ హాజరై పూజలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, బిజెపి నాయకులు దామోదర్, శ్రీకాంత్, ఉమేష్, ఆనంద్‌రావు, అరుణ్ కుమార్, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు

## పోస్ట్ ఆఫీస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

### అసిస్టెంట్ సూపరింటెండెంట్ సంపత్‌రెడ్డి

**జీడిమెట్ల, డిసెంబరు 10, ప్రభాతవార్త :** పోస్ట్ ఆఫీస్‌లో ప్రజలకు అనేక స్కీములు ఉన్నాయని వాటిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ సూపరింటెండెంట్ సంపత్ రెడ్డి కోరారు. బుధవారం సూరారం కాలనీలోని లూయిస్ బ్రెయిలీ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పోస్ట్ ఆఫీస్ ద్వారా ఏ ఏ సేవలు అందుతున్నాయో, పోస్ట్ ఆఫీస్‌లో పొదుపు ఖాతాలు, సుకన్యా యోజన ఇన్సూరెన్స్ లాంటి వివిధ కార్యక్రమాల గురించి తెలియజేశారు. అనంతరం పోస్ట్ ఆఫీస్ నుండి ముఖ్య అతిథులుగా పోస్టాఫీసు అసిస్టెంట్ సూపరింటెండెంట్ సంపత్ రెడ్డి, ప్రిప్ ప్రవీణ్, పోస్ట్ మాస్టర్ రామాంజనేయులు పాల్గొని లూయిస్ బ్రెయిలీ భవనంలో వివరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ డిజేబుల్ అధ్యక్షులు అంజయ్య గౌడ్, కార్యదర్శి నరేందర్ రెడ్డి, రాజ్ కుమార్, సత్యం, సరిత, శిరీష కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## నాలా నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి


### ఎమ్మెల్యే వివేకానంద్


నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద

**జీడిమెట్ల, డిసెంబరు 10, ప్రభాతవార్త :** ఆక్రమణలను తొలగించి నాలా నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని బిఆర్ఎస్ఎల్పి విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. బుధవారం 130 సుభాష్ నగర్ డివిజన్ గంప బస్తీ నాలా నిర్మాణ పనులను బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ క్షేత్రస్థాయిలో అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మౌళిక వసతుల కల్పనలో భాగంగా నాలా నిర్మాణ పనులను చేపట్టడం ద్వారా మురుగునీరు ప్రవాహం సాఫీగా ఉంటుందని, నాలా ప్రవాహ దిశలో ఆక్రమణలకు గురైన స్థలాలను గుర్తించి అట్టి నిర్మాణాలను తొలగించి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీ నరసింహ, వాటర్ వర్క్స్ జిఎం మాధవి, జిహెచ్ఎంసి ఈఈ లక్ష్మీ గణేష్, డీఈ పాపమ్మ, టౌన్ ప్లానింగ్ అధికారులు సురేందర్ రెడ్డి, మధు, జిహెచ్ఎంసి ఏఈ అనురాగ్, వాటర్ వర్క్స్ మేనేజర్ శివప్రసాద్, కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డి, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కోఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, సీనియర్ నాయకులు బలరాం రెడ్డి, శ్రీనివాసరాజు, గుబ్బల లక్ష్మీనారాయణ, ఆశిక్ అలీ, ఇస్మాయిల్, ప్రసాద్, శంకర్, శ్రీను, దుబాయ్ శ్రీను, దుర్గారావు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

### భాగ్యలక్ష్మీ మందిరంలో హరినారాయణచార్య మహారాజ్ పూజలు

**చార్మినార్, డిసెంబరు 10 ప్రభాతవార్త :** అయోధ్యకు చెందిన పరమ పూజ్య స్వామి శ్రీహరినారాయణ చార్య బుధవారం చార్మినార్ శ్రీభాగ్యలక్ష్మీ మందిరాన్ని సందర్శించారు. శ్రీ భాగ్యలక్ష్మీ అమ్మవారికి స్వామి హరినారాయణ చార్య పూజలు నిర్వహించారు. ఆలయ గౌరవ మర్యాదలతో మందిరం కమిటి ప్రతినిధులు హరినారాయణ చార్యకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో శ్రీ మద్ భాగవత్ కథ కార్యక్రమం కార్యదర్శి, ప్రముఖ వ్యాపార వేత్త సంజయ్ అగర్వాల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.


శ్రీ భాగ్యలక్ష్మీ మందిరంలో పూజలు నిర్వహిస్తున్న స్వామి శ్రీ హరినారాయణ



# నగదు అందిస్తున్న ప్రదీప్

## రోడ్డు ప్రమాద బాధితుడికి నగదు అందజేత

**హయత్ నగర్, డిసెంబర్ 10 ప్రభాత వార్త :** రోడ్డు ప్రమాదంలో గాయపడిన నిరుపేద కుటుంబానికి చెందిన వ్యక్తికి బీఆర్ఎస్ ఎల్బీనగర్ యువజన విభాగం మాజీ ఇంచార్జి గొరిగె ప్రదీప్ కురుమ 10 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. రంగనాయకుల గుట్ట బస్తీకి చెందిన బాబూలాల్ పది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ప్రదీప్ అతని ఇంటికి వెళ్ళి నగదు అందించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు తొండ వెంకటేష్, కాటేపాక స్కైలాబ్, బలరాం పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలలో మానవ హక్కులపై అవగాహన

**హయత్ నగర్, డిసెంబర్ 10 ప్రభాత వార్త:** మానవ హక్కులు అనేవి వారి మనుగడకు ప్రాథమిక అవసరాలని హయత్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. సురేష్ బాబు అన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్క రించుకొని హయత్ నగర్ లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ... ప్రపంచవ్యాప్తంగా ఎక్కడో ఒకచోట నిత్యం మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతొందన్నారు. విద్యార్థులు వాటిపై అవగాహన పెంచుకోవడంతో పాటు బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. పలు జాతీయ, అంతర్జాతీయ మానవ హక్కుల ఉల్లంఘన ఘటనలను ఉదహరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు నాగరాజ్ యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీపతి నాయుడు, మధు ధర్మపురి, నరసింహ, ఉష, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## వరకట్న వేధింపులు - యువతిని హతమార్చిన కుటుంబం

### నలుగురికి ఏడేళ్ల జీవిత ఖైదు

నేరెడ్ మెట్, డిసెంబర్ 9:వరకట్న వేధింపులే కారణంగా యువతిని హత్య చేసిన కేసులో నలుగురు దోషులకు న్యాయస్థానం ఏడేళ్ల జీవిత ఖైదు విధించింది. మల్కాజ్‌గిరి పోలీసు స్టేషన్ పరిధిలో నమోదైన ఈ కేసుకు సంబంధించిన తీర్పును మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, కుషాయిగూడలోని ప్రధాన సెషన్స్ న్యాయస్థానం బుధవారం తీర్పు వెలువరించింది. ఈ కేసును ప్రధాన సెషన్స్ జిల్లా న్యాయమూర్తి శ్రీదేవి విచారించారు.

**వివరాల్లోకి వెళ్తే**

న్యూ బోయిన్ పల్లికి చెందిన నాగమల్లి సందీప్ కుమార్ నవంబర్ ఒకటి 2015న మల్కాజ్‌గిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన సోదరి ఎన్. రాధిక (భర్త: నకిరికంటి సతీష్ కుమార్) ఇద్దరు పిల్లలతో కలిసి మల్కాజ్‌గిరి సంతోష్ నగర్‌లో నివాసం ఉంటుండేదని పేర్కొన్నారు. దుస్తులు ఉతుకుతున్న సమయంలో అకస్మాత్తుగా తీవ్ర వాంతులు రావడంతో ఆమె పరిస్థితి విషమించిందని, భర్త ఫోన్ ద్వారా తెలియజేశాడని తెలిపారు. వెంటనే ఎల్.కే. హాస్పిటల్‌కు తరలించినప్పటికీ, వైద్యులు ఆమె మృతి చెందినట్లు ప్రకటించారు. మరణంపై అనుమానం వ్యక్తం చేసిన ఫిర్యాదుదారి ఫిర్యాదు మేరకు వరకట్న హత్య కేసుగా మల్కాజ్‌గిరి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా, విచారణ అనంతరం ఇది సెషన్స్ కోర్టుకు చేరింది. న్యాయస్థాన విచారణలో వరకట్నం కోరుతూ మృతురాలిని శారీరకంగా, మానసికంగా వేధించి హత్య చేసినట్లు అభియోగాలు రుజువయ్యాయి. ఈ నేపథ్యంలో నిందితులు అయిన భర్త నకిరికంటి సతీష్ కుమార్, మామ నకిరికంటి సర్వేశ్వర్ రావు, ఆడపడుచు గౌరు సరిథాదేవి, అత్త నకిరికంటి అందాలు నలుగురికీ ఏడేళ్ల జీవిత ఖైదుతో పాటు శిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పు వెలువరించింది. వరకట్న వేధింపులపై కోర్టు ఇచ్చిన ఈ కఠిన తీర్పు సమాజానికి హెచ్చరికగా నిలిచిందని న్యాయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## దశలవారిగా సమస్యల పరిష్కారం : బన్నాల గీత

**ఉప్పల్, డిసెంబరు 10 ప్రభాతవార్త :**

చిలుకానగర్ డివిజన్ లోని సమస్యలను దశలవారిగా పరిష్కారం చేస్తున్నామని స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం డివిజన్ పరిధిలోని పలు కాలనీ ప్రజల నుంచి సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ చిలుకానగర్ డివిజన్ పరిధిలోని ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. డివిజన్ ప్రజల విజ్ఞప్తి మేరకు అన్ని ప్రాంతాల్లో పెండింగ్ లో ఉన్న పనులు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాలనీవాసులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.



డివిజన్ ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ తదితరులు

# తెలంగాణ వైద్య విధాన పరిషత్ ను రద్దు చేయాలి: మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు శ్రీనివాస్ మూర్తి

**మలక్ పేట ,డిసెంబర్ 10, ప్రభాతవార్త:**

తెలంగాణ వైద్య విధాన పరిషత్ ను రద్దు చేసి, ఆ స్థానంలో డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్ ను ఏర్పాటు చేసి ఉద్యోగులకు ట్రెజరీ ద్వారా సాలరీస్ (010) చెల్లించాలని ఏఐటియూసి అనుబంధ తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.ఎస్.మూర్తి డిమాండ్ చేసారు. ఈ మేరకుబుధవారం ఆయన ఆధ్వర్యంలో మలక్ పేట ఏరియా ఆసుపత్రిలో వైద్యశాల ఉద్యోగుల సంతకాలు సేకరించి, మెడికల్ సూపరింటెండెంట్ కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన సందర్భంగా మాట్లాడుతూ 1986 వ సంవత్సరంలో ఏర్పాటు చేసిన వైద్య విధాన పరిషత్ లో పనిచేస్తున్న ఉద్యోగులందరూ ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణింపక పోవడం, అధికారులకు గెజిటెడ్ హోదా లేకపోవడం, వేతన సవరణ సంఘానికి వినతులు సైతం సమర్పించక లేకపోవడం,ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించకపోవడంతో పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.మరో వైపు పక్క రాష్ట్రం ఏ.పి.లో వైద్య విధాన పరిషత్ రద్దు చేసి, ఆ స్థానం లో డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసస్ ఏర్పాటు చేసారని , మన రాష్ట్రంలో కూడా అలాగే చేయాలని పేర్కొన్నారు. యూనియన్ నిర్ణయించిన విధంగా ఈ రోజు ఉద్యోగుల ఆకాంక్ష ప్రభుత్వానికి మరియు అధికారులకు తెలియజేయడానికి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వైద్యశాలల్లో ఉద్యోగులు సామూహికంగా సంతకాలు సేకరించి అధికారులకు అందజేశామన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా తగిన చర్యలు చేపట్టాలని కోరారు. అదేవిధంగా యూనియన్ గౌరవ అధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి, మహబూబ్ నగర్ ప్రధాన కార్యదర్శి ఇందిరా శ్రీలక్ష్మి, వివిధ జిల్లాల యూనియన్ రాష్ట్ర నాయకులు పరబ్ కుమార్, రామారావు , శ్రీనివాసాచారి నర్సయ్య ,మెదక్ పిట్టల స్వాతి, హుజూరాబాద్ సరస్వతి ,సతీష్, జగన్ మోహన్ రావు, అమృతరావు తదితరులు ఆయా జిల్లాలలోసామూహిక వినతి పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.



ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ కు వినతిపత్రం అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్ మూర్తి, ప్రధాన కార్యదర్శి జగన్మోహన్ రావు తదితరులు

# 11న శ్రీ కాల బైరవస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలు

**ఉప్పల్, డిసెంబరు 10 ప్రభాతవార్త**

ఉప్పల్ భగాయత్ లోని శ్రీ కాల బైరవస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలు ఈనెల 11 నుంచి రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటి నేతలు తెలిపారు. ఉప్పల్ భగాయత్ లోసుమారు 500 సంవత్సరాల చరిత్ర ఉన్న పురాతన దేవాలయం అధునిక హంగులతో కొత్తగా నిర్మించారు. భక్తుల కోరికలు తీర్చే స్వామిగా పేరొందిన శ్రీ కాల బైరవస్వామి ఆలయంలో ప్రతి అమావాస్యకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఇదే క్రమంలో ఈనెల 11న ఉదయం బహుళ అష్టమి నుంచి 12వ తేది తృతీయ సంవత్సరం బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి గంటంబోట్ల వెంకటరమణ (కన్నయ్య పంతులు), నిడుమోలు రామకృష్ణశర్మ తెలిపారు. ఈనెల 11న గురువారం ఉదయం సుప్రభాతసేవ, అభిషేకం, గోపూజ, యాగశాల ప్రవేశం, దీపారాధన, శ్రీ లక్ష్మి గణపతి నవగ్రహ వాస్తు, క్షేత్రపాలక, యోగిని, అష్టకాల బైరవ మంటప ఆరాధన, అష్టోత్తర కలశస్థాపన, శ్రీ స్వయంభు కాల బైరవస్వామి మహాభిషేకం, అలంకరణ, అగ్ని ప్రతిష్ట, హారతి, అన్న ప్రసాద వితరణ, సాయంత్రం గణపతిపూజ, అష్ట కాల బైరవ మంత్ర హవనం, పంచ మహా మంగళహారతి, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ, ఆశీర్వచనం ఉంటుందని తెలిపారు. అదే విధంగా నెల 12వ తేదిన ఉదయం సుప్రభాత సేవ, అభిషేకం, అష్ట కాల బైరవ హవనం, బలి ప్రధానం, పూర్ణాహుతి, ప్రధాన కళష సంప్రోక్షణ, శివ పార్వతి కళ్యాణం, బ్రహ్మణ ఆశీర్వచనం, అన్న ప్రసాద వితరణ, సాయంత్రం గణపతి ఆరాధన, స్వామి వారి పల్లకి సేవ, పంచ హారతులు, మహా జ్వాలా తోరణం, తదితర కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు.



ఉప్పల్ భగాయత్ లో బ్రహ్మోత్సవాలకు ముస్తాబు అయిన శ్రీ కాల బైరవస్వామి ఆలయం దృశ్యం.



ఉప్పల్ లో కొలువు దీరిన శ్రీ కాల బైరవస్వామి స్వామి దృశ్యం.

# జవహర్‌నగర్‌లో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం

## న్యాయం, సమానత్వమే లక్ష్యం : చెరుకు రమేష్

**నేరెడ్ మెట్, డిసెంబర్ 10, ప్రభాతవార్త :**




అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని జవహర్‌నగర్‌లో సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ సివిల్ రైట్స్ కౌన్సిల్ (ఎస్జేఎఫ్ఐసీఆర్సీ) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర చైర్మన్ చెరుకు రమేష్ అధ్యక్షత వహించగా, సంస్థ ఫౌండర్ డాక్టర్ దివాస్లామ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజంలో ప్రతి పౌరుడికి సమాన హక్కులు, న్యాయం అందేలా రాజకీయ వ్యవస్థ మరింత బాధ్యతగా వ్యవహరించాలని పేర్కొన్నారు. మానవ హక్కుల పరిరక్షణలో యువత, మహిళల పాత్ర కీలకమని అభిప్రాయపడ్డారు. రాజకీయ, సామాజిక జీవనంలో మానవ హక్కుల విలువలు మరింత బలపడాల్సిన అవసరం ఉందని వక్తలు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్జేఎఫ్ఐసీఆర్సీ జాతీయ చైర్మన్ షౌకత్ మీర్జా, గుజరాత్ యూత్ ప్రెసిడెంట్ సయ్యద్ ముజమిన్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రంగా శ్రీనివాస్ గౌడ్, ఉమెన్ అధ్యక్షురాలు లక్ష్మీ శ్రావణి పాల్గొన్నారు. అలాగే తెలంగాణ రాష్ట్ర బృంద సభ్యులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, రాజకీయ నాయకులు రంగుల శంకర్, మీడియా ప్రతినిధులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# బోడుప్పల్ డివిజన్లో ఇందిరమ్మ ఇల్లు భూమి పూజా

**బోడుప్పల్, డిసెంబర్ 10 ప్రభాతవార్త :**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ డివిజన్ల లో ఇందిరమ్మ ఇల్లు భూమిపూజ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బొమ్మక్ కల్యాణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై స్థానిక ప్రజలతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

**బొమ్మక్ కల్యాణ్ కుమార్ మాట్లాడుతూ...**



కాలనీ ప్రజల ఎన్నో సంవత్సరాలుగా ఉన్న గృహావసరాల సమస్యలు పరిష్కార దిశగా సాగుతున్నందుకు ఆనందం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇల్లు పథకం సాధికారతకు ఇది ఒక ముఖ్యమైన మైలు రాయిగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక అంబేద్కర్ నగర్ ఫేజ్-3 కాలనీ కమిటీ సభ్యులు, రాజీవ్ నగర్ ఫేజ్-2 కాలనీ కమిటీ సభ్యులు, దేవేందర్ నగర్ నివాసులు, వార్డు అధికారులు, ఇందిరమ్మ ఇల్లు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అధికారులను సమన్వయం చేసుకుని సమస్యలను పరిష్కరిస్తా

**హయత్ నగర్, డిసెంబర్ 10 ప్రభాత వార్త:**

అధికారులను సమన్వయం చేసుకుని కాలనీలోని సమస్యలను పరిష్కరిస్తానని హయత్ నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అన్నారు. మార్నింగ్ వాక్‌లో భాగంగా కార్పొరేటర్ బుధవారం రంగనాయకుల గుట్టలో పర్యటించి కాలనీవాసుల సమ స్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు కాలనిలో విద్యుత్ దీపాల సమస్యలున్నాయని, ఒక వీధిలో రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం ఉండటం వల్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని వివరిం చారు. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ సరిగా పనిచేయకపోవడంతో తరచూ మురుగు నీరు రోడ్లపై చేరి దుర్వసన వస్తోందని, దోమలు వృద్ధి చెందుతున్నాయని ఫిర్యాదు చేశారు. దీనిపై కార్పొరేటర్ స్పందిస్తూ... త్వరితగతిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ నిచ్చారు. కార్య క్రమంలో కాలనీ ప్రతి నిధులు శంకర్ నాయక్, కానుగుల మహేష్, రాజు, నవీన్, ప్రమోద్, శంకర్ పాల్గొన్నారు.



రోడ్లపై పారుతున్న మురుగును పరిశీలిస్తున్న కార్పొరేటర్

## మెస్సీ మ్యాచ్ కు పాసులు ఉంటేనే ఎంట్రీ : సిపి సుధీర్ బాబు

**ఉప్పల్, డిసెంబరు 10 ప్రభాతవార్త :**

ఉప్పల్ లోని రాజీవ్‌గాంధీ స్టేడియంలో ఈనెల 13న జరిగే మెస్సీ ఫుట్ బాల్ మ్యాచ్ కు పాసులు ఉంటేనే ఎంట్రీ ఉంటుందని, లేకుంటే లోపలికి అనుమతి లేదని రాచకొండ సిపి సుధీర్ బాబు తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సిపి సుధీర్ బాబు మాట్లాడుతూ ఈనెల 13న సాయంత్రం జరిగే మెస్సీ ఫుట్ బాల్ మ్యాచ్ సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, అన్ని గేట్ల వద్ద మూడంచెల భద్రత కట్టుదిట్టంగా ఉంటుందని తెలిపారు. పాసులు లేని వారు స్టేడియం పరిసరాల్లోకి రావద్దని సూచించారు. తెలంగాణ సీఎం - మెస్సి తో జరిగే మ్యాచ్ నేపథ్యంలో ఉప్పల్ స్టేడియం వద్ద రద్దీ ఏర్పడకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. టికెట్, పాసులు ఉన్న వారు మాత్రమే స్టేడియం వద్దకు రావాలని, పాసులు ఉన్న వారికి మాత్రమే అనుమతి ఉంటుందని, మిగిలిన వారికి ఎట్టి పరిస్థితిలో అనుమతి లేదన్నారు. క్రీడాభిమానులు సహకరించాలని ఆయన కోరారు.




## మల్కాజిగిరి లో జర్నలిస్టుల మహాసభ

### పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి

**నేరెడ్ మెట్ డిసెంబర్10,ప్రభాత వార్త**

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా 3వ మహాసభ మల్కాజిగిరి నియోజకవర్గం నేరెడ్ మెట్ లో ఈ నెల 14న జరుగనున్నాయి. ఈ సందర్భంగా బుధవారం మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్డాడుతూ మహాసభ విజయవంతంగా జరగాలని ఆశిస్తున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యు జేఎఫ్ జిల్లా కన్వీనర్ జి హరి ప్రసాద్, కో కన్వీనర్ పి మల్లేష్ గౌడ్, సీనియర్ జిల్లా నాయకురాలు రోజా రాణి, దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.




వివరాలను వెల్లడిస్తున్న డిప్యూటీ కమిషనర్ ఎంకే ఇంకేషాఫ్ అలీ తదితరులు

## మలక్ పేట నియోజకవర్గంలో నూతనంగా మూడు డివిజన్ల ఏర్పాటు

**మలక్ పేట, డిసెంబర్ 10, ప్రభాతవార్త:**


జిహెచ్ఎంసి పరిధిలోని నూతన డివిజన్ల పునర్విభజనలో భాగంగా మలక్ పేట నియోజకవర్గంలో నూతనంగా మూడు డివిజన్లు ఏర్పాటు అయ్యాయి. ప్రస్తుతం మలక్ పేట్ నియోజకవర్గంలో ప్రస్తుతం ఓల్డ్ మలక్ పేట్, అక్బర్ బాగ్, ముసారాంబాగ్ అజంపుర, సైదాబాద్, చౌని డివిజన్లు ఉండగా, నూతనంగా ఆస్మాన్ ఘాడ్, ఎంసిహెచ్ కాలనీ, కాలాడేరా డివిజన్లు ఏర్పడ్డాయని మలక్ పేట సర్కిల్ -6 డిప్యూటీ కమిషనర్ ఎంకే ఇంకెషాఫ్ అలీ వివరించారు. వారం రోజుల లోపు ఎటువంటి అభ్యంతరాలు ఉన్న లిఖితపూర్వకంగా మలక్ పేట సర్కిల్ కార్యాలయంలో అందజేయాలని ఆయన పేర్కొన్నారు. బుధవారం నాడు ఎటువంటి అభ్యంతరాలు రాలేదని తెలియజేశారు.



## డిప్యూటీ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి కి వినతిపత్రం అందజేత

**తుర్కయంజాల్ డిసెంబర్10( ప్రభాతవార్త)**

తుర్కయంజాల్ సర్కిల్లో భారతీయ జనతా పార్టీ శాఖ అధ్యక్షులు ఎలిమినేటి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఫిర్యాదు ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా బిజెపి ఎస్సీ మోర్చా కోశాధికారి బచ్చి గళ్ళ రమేష్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం నిన్న జారీ చేసిన జీవో ప్రకారం జిహెచ్ఎంసి లో జరిగిన వార్డు విభజనను బిజెపి తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. కొంచెమైనా సాంకేతికత లేకుండా ఎలా పడితే అలా విభజించి వార్డులను చేయడమేదైతే ఉందో అది బిజెపి తీవ్రంగా ఖండిస్తుంది.వెంటనే ప్రభుత్వం వెనుకకు తీసుకొని జనాభా ప్రాతిపదికిన మరియు వైశాల్యం ఆధారితన శాస్త్రీయ పద్ధతి సర్వే నిర్వహించి వార్డుల విభజన చేయాలని బిజెపి డిమాండ్ చేస్తున్నది. ఈ కార్యక్రమంలో కొత్త రామ్ రెడ్డి, నోముల కార్తీక్, కొండ్రు పురుషోత్తం, నందగిరి సురేష్, కంచరమోని దాసు, సాయి తదితరులు పాల్గొన్నారు.




బోడుప్పల్ సర్కిల్ కార్యాలయంలో ముసాయిదా ప్రకటన డ్రాఫ్ ను ప్రదర్శిస్తున్న బోడుప్పల్ డిప్యూటీ కమిషనర్ ఏ శైలజ , శానిటేషన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు

## వార్డుల విభజన అభ్యంతరాలు లిఖిత పూర్వకంగా ఇవ్వాలి-

### డిప్యూటీ కమిషనర్ ఏ శైలజ సూచన

**బోడుప్పల్, డిసెంబర్ 10 ప్రభాతవార్త :**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ ఆదేశాల మేరకు హైదరాబాద్ మహానగర పాలక సంస్థ యొక్క వార్డు పరిమితుల పునర్నిర్వచన (డీలిమిటేషన్ ఆఫ్ వార్డ్స్) కు సంబంధించిన ముసాయిదా ప్రకటన డ్రాఫ్ట్ పబ్లికేషన్ బుధవారం బోడుప్పల్ సర్కిల్ కార్యాలయంలో ఫామ్ -1 ద్వారా డిప్యూటీ కమీషనర్ ఎ. శైలజా విడుదల చేయడం జరిగినది. ఇట్టి డ్రాఫ్ట్ పై ప్రజల అభిప్రాయాలు, సూచనలు స్వీకరించడానికి ఈ ముసాయిదా ప్రచురించబడిందని,కొత్తగా ప్రతిపాదించిన 300 వార్డుల కు సంబంధించిన ముసాయిదా ప్రకటన డ్రాఫ్ట్ పబ్లికేషన్ బోడుప్పల్ సర్కిల్ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని,కావున పౌరులు తమ సూచనలు,అభ్యంతరాలు లిఖిత పూర్వకంగా బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయానికి నిర్ణీత గడువు ఈ నెల 16 వరకు సమర్పించవచ్చని, అందువల్ల పౌరులు తమ విలువైన అభిప్రాయాలను,సూచనలు అందించాలని డిప్యూటీ కమిషనర్ ఏ శైలజ విజ్ఞప్తి చేశారు.